క్లుప్తంగా

భూమిపూజ



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న కోటి లింగాల ప్రతిష్ఠ చేసే మండప నిర్మాణం కోసం సోమవారం అలంపూర్ మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి భూమిపూజ చేశారు. కార్తీక మాసంలో కోటిలింగాలను ప్రతిష్ఠించి వాటి పైభాగంలో పంచలోహ లింగం ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ ధర్మకర్త రుమాళ్ల మహేశ్వర్, ఆలయ ప్రధాన కార్యదర్శి రుమాళ్ల శేఖరయ్య తెలిపారు.

వాల్మీకుల అభ్యున్నతికి కృషి

అమరచింత: వాల్మీకి యూత్ నూతన పట్టణ కమిటీని సోమవారం వాల్మీకి ఆలయంలో ఎన్నుకున్నట్లు వాల్మీకి మండల అధ్యక్షుడు హర్ష వెంకటేష్ తెలిపారు. అధ్యక్షుడిగా వెంకీ, ఉపాధ్యక్షుడిగా బొగ్గు సూరి, శంకర్‌లింగం, ప్రధాన కార్యదర్శిగా కడియాల యాదగిరి, ప్రచార కార్యదర్శిగా చిన్న, సహాయ కార్యదర్శిగా మోహన్, ముఖ్య సలహాదారులుగా తోకలి రమేష్‌తో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

స్థల పరిశీలన



అమరచింత: పట్టణంలోని బస్టాండ్ ప్రాంగణంలో వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటు కోసం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థల పరిశీలన చేపట్టామని కమిషనర్ మహమ్మద్‌ఖాజ తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి సమక్షంలో చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయడానికి వీలుగా అనువైన స్థలానికి ఎంపిక చేశామన్నారు. భవిష్యత్తులో రోడ్ వైడింగ్‌ను దృష్టిలో ఉంచుకొని బస్టాండు ఆవరణంలో చివరి భాగంలో స్థలాన్ని నిర్ణయించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఎస్‌ఏ రాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ నాగభూషణం గౌడ్, బాలరాజ్, రాజేష్, ప్రేమరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఆత్మకూర్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగికి ఆర్థికంగా సహకరించి అండగా నిలిచారు వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి. మండలంలోని వీరరాఘవపూర్‌కు చెందిన చిన్నయ్య అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యానికి రూ 2.50లక్షలు ఖర్చు అవుతుండడంతో విషయం తెలుసుకున్న వర్కటం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుతో మాట్లాడి రూ.1.50లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించి సోమవారం బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా చిన్నయ్య కుటుంబ సభ్యులు, వీరరాఘవపూర్ గ్రామస్తులు వర్కటంకు కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీల నిరవధిక సమ్మె

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు సోమవారం తరలివెళ్లారు.

బీఎస్పీతోనే పేదలకు మేలు



ఆత్మకూర్: బహుజన్ సమాజ్‌వాది పార్టీ కత్తెపల్లి గ్రామ కార్యవర్గాన్ని సోమవారం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు, పేట జిల్లా ఇన్‌చార్జ్ అర్జున్‌రాజ్, మక్తల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రకాష్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భార్గవ్, భూత్ కమిటీ అధ్యక్షుడిగా భరత్, ఉపాధ్యక్షుడిగా రమేష్, ప్రధాన కార్యదర్శిగా కౌశిక్, ప్రచార కార్యదర్శిగా శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులుగా శ్రీధర్, సాయికుమార్, అంజి, గోవిందుతో పాటు 10మంది కార్యవర్గ సభ్యులను నియమించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థి గెలుపే ధ్యేయంగా ముందుకెళ్తామన్నారు.

కొనసాగుతున్న దీక్ష

కోడేరు: ముత్తిరెడ్డిపల్లి గ్రామాన్ని కోడేరు మండలంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు చేపట్టిన నిరాహార దీక్ష సోమవారం నాటికి 3వ రోజుకు చేరుకుంది. అబ్దుల్ కలాం ఫౌండేషన్ అధ్యక్షుడు సింగోటం రామన్న వారికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాంత్, సందీప్‌యాదవ్, మూర్తి, గణేష్, అశోక్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ మాస పూజలు



నాగుల విగ్రహాలకు పూజలకు చేస్తున్న భక్తులు



మార్కండేయ ఆలయంలో పూజలు చేస్తున్న పద్మశాలీలు

అమరచింత: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని నాగుల ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. కొత్తగా పెళ్లి చేసుకున్న దంపతులు జంటగా వచ్చి నాగుల విగ్రహాలకు పాలతో అభిషేకించి నైవేద్యం సమర్పించారు. ఆయా వార్డులలోని ప్రజలు, మహిళలు ఆలయానికి తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. శివాజీనగర్‌లో వెలసిన నాగుల ఆలయం వద్ద హర్షశ్రీనివాస్ దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఏడాది శ్రావణ చివరి సోమ వారం ప్రత్యేక పూజలతో పాటు అన్నదానం నిర్వహించడం ఆనవాయితీ అని పూజారులు పేర్కొన్నారు.

నేటి నుంచి మద్దిలేశ్వరి మాత ఉత్సవాలు

పట్టణంలో వెలసిన మద్దిలేశ్వరి మాత ఉత్సవాలు మంగళవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు పద్మశాలి సంఘం అధ్యక్షుడు మహంకాళీ విష్ణు తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని భక్త మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి బెల్లం పానకంతో పాటు పప్పుబెల్లం నైవేద్యంగా సమర్పించి బండారంతో పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించామన్నారు. ప్రతి సంవత్సరం శ్రావణ మాసం చివరి రోజుల్లో నిర్వహించే పద్మశాలీల ఇలవేల్పు అమ్మవారి ఉత్సవాల్లోభక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో దేవరకొండ లచ్చన్న, మహంకాళీ ప్రభాకర్, మోహన్, ఎంకంపల్లి శ్రీను, మాదన్న పాల్గొన్నారు.

ఇంటింటి నుంచి మట్టి సేకరణ



ప్రజల నుంచి మట్టి సేకరిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు మేరా దేశ్ మేరా మట్టి కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలోని 15, 17, 19, 22వ వార్డుల్లో ఇంటింటి నుంచి మట్టి, బియ్యం సేకరించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము మాట్లాడుతూ.. ప్రజల నుంచి సేకరించిన మట్టితో మోదీ ఢిల్లీలో 75వేల మొక్కలు నాటనున్నారని, మేరా దేశ్ మేరా మట్టి కార్యక్రమంపై ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ, సీతారాములు, రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి, బండారు కుమార్‌స్వామి, బాబురావు, బాలస్వామి, పెద్దిరాజు, సూగురు రాము, రాయన్న సాగర్, మోహన్ సాగర్, కుమార్, పాత బజార్ రావు, గోవిందు, రఘు, ఎద్దుల రాజు, శివ, నాయకులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలో విద్యార్థుల ప్రతిభ



తైక్వాండోలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో సీనియర్ మాస్టర్లు

కొత్తకోట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10న జిల్లా కేంద్రంలోని యాదవ కమిటీ హాల్లో నిర్వహించిన తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ అండర్ 14, 17, 19 విభాగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కొత్తకోట, పాలెం, గోవిందహళ్లి గ్రామాలకు చెందిన విద్యార్థులతో మొత్తం 22మంది విద్యార్థులు పాల్గొనగా.. తొమ్మిది మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్, ఆరుగురు సిల్వర్ మెడల్స్, ఏడుగురు బ్రొంజ్ మెడల్స్ సాధించారని కోచ్ శివశంకర్ తెలిపారు. పథకాలు సాధించిన విద్యార్థులను సీనియర్ మాస్టర్లు రవి, రమేష్‌రెడ్డి, పరశురాములు, శివయ్య, నరేందర్ సాగర్, పెంటన్నయాదవ్, నరేష్‌నాయుడు తదితరులు అభినందించారు.

తెగుళ్ల నివారణకు సత్వర చర్యలు అవసరం



వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ డాకేశ్వర్‌గౌడ్

వీపనగండ్ల: వరి పంటలో సోకుతున్న తెగుళ్ల నివారణకు రైతులు సత్వర చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ అన్నారు. సోమవారం కల్వరాల శివారులో వరి పంటలకు సోకిన తెగుళ్లను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. వరి పంటలో ప్రధానంగా గందపు దుష్ప్రభావం వల్ల మొక్కలు గుంపులు గుంపులుగా చనిపోతాయని, ఆ తెగులును గుర్తించి వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి మందులు పిచికారీ చేయాలన్నారు. వరి పంటల అధిక దిగుబడికి నీటి నిర్వహణ పద్ధతులు, మొక్కల వేర్లకు గాలి సరిగా అందే విధంగా చూడటం, సరైన మోతాదులో కాంప్లెక్స్ ఎరువుల వాడాలని సూచించారు.

యాదాద్రిలో మూలమల్ల భజన మండలి



ఆత్మకూర్: యాదాద్రి నర్సింహాస్వామి ఆలయం నుంచి మండలంలోని మూలమల్ల గ్రామానికి చెందిన శ్రీపాండురంగస్వామి భజన మండలికి పిలుపు రావడంతో సోమవారం వారు తరలివెళ్లారు. వనపర్తి జిల్లాలోనే మూలమల్ల భజనమండలికి మంచి గుర్తింపు రావడంతో శ్రీనర్సింహాస్వామి సన్నిధిలో గీతాపాలన చేసేందుకు పిలుపు వచ్చినట్లు మండలి అధ్యక్షుడు సత్యారెడ్డి తెలిపారు. సోమవారం ఆలయంలో నిర్వహించిన భజన కార్యక్రమంలో తమ బృందానికి ప్రత్యేకంగా ఆలయ నిర్వాహకులు అభినందించారన్నారు. కార్యక్రమంలో భగవంత్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సునంద్‌గౌడ్, శేఖర్, కురుమూర్తి, కుమార్, భాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి, సంజన్న, ఆనంద్ ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

పెంట్లవెల్లి: రోడ్డు నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సురేష్ అన్నారు. సోమవారం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మండల కేంద్రంలో ఆటోడ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. అదే విధంగా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. రాంగ్ రూట్, నంబర్ ప్లేట్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ చంద్రయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



రూ.26 వేల కనీస వేతనం అందించాలి



వనపర్తిలో మాట్లాడుతున్న నాయకులు

పెబ్బేరు రూరల్: స్వీపర్లకు నెలకు రూ.26 వేల జీతం అమలు చేసే వరకు పోరాడుదామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ పిలుపునిచ్చారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని స్వీపర్లు చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 78వ రోజుకు చేరింది. వనపర్తి కలెక్టర్ కార్యాలయం సమీపంలో స్వీపర్లు చేస్తున్న దీక్షకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని అధికారంలోకి వచ్చిన కేసీఆర్ అందరిని మోసం చేశారని విమర్శించారు. పేదరికాన్ని ఆసరా చేసుకొని ప్రభుత్వం శ్రమ దోపిడికి పాల్పడుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్, జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, ఖాజపాషా, రషీద్, ఖయ్యాం , భాలస్వామి, కురుమన్న, గీత, నాగమ్మ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి

వీపనగండ్ల: కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ సోమవారం స్థానిక తహసీల్దార్ వరలక్ష్మికి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతన చట్టాన్ని సవరించలేదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు అన్నారు. దీంతో రాష్ట్రంలోని అనేక కుటుంబాలు పేదరికంలో మగ్గుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కృష్ణయ్య, నిరంజన్, రాములు, నర్సింహ, బాలగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

పాన్‌గల్: కొల్లాపూర్ పట్టణంలో ఈనెల 16న నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభకు మండలంలోని ప్రతి గ్రామం నుంచి ప్రజలు భారీగా తరలివచ్చేలా ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాముయాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామాల వారిగా తరలి వచ్చే జనం, ఎన్ని వాహనాలు ఏర్పాటు చేయాలనే తదితర అంశాలపై చర్చించారు. పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు సమన్వయంతో పనిచేస్తూ భారీగా జన సమీకరణ చేయాలని సూచించారు. నియోజకవర్గంలోనే పాన్‌గల్ మండలం నుంచి అత్యధిక సంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లే విధంగా చూడాలన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోమ్‌నాథ్‌నాయక్, అడ్వకేట్ రవికుమార్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్యానాయుడు, దేవేందర్‌నాయుడు, దశరథ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ఎల్లేని' దీక్షకు మద్దతు

వీపనగండ్ల: దేశవ్యాప్తంగా కొల్లాపూర్ మామిడి పండ్లకు ప్రత్యేక గుర్తింపు ఉందని, రైతులకు అనువుగా కొల్లాపూర్‌లో మామిడి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ కొల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ ఎల్లేని సుధాకర్‌రావు కొల్లాపూర్ పట్టణంలో సోమవారం నుంచి నిర్వహించిన రెండు రోజుల నిరసన దీక్షకు మండలంలోని వివిధ గ్రామాల బీజేపీ నాయకులు తరలి వెళ్లారు. ప్రభుత్వం స్పందించి మామిడి రైతులకు కనీస మద్దతు ధరను ప్రకటించి కొల్లాపూర్ పట్టణంలో మామిడి మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

స్క్రాప్ బ్యాటరీల చోరీ

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని పెద్దగూడెంలో ఉన్న హెచ్‌పీసీఎల్ ఐపీ స్టేషన్ నుంచి స్క్రాప్ బ్యాటరీలను ఈ నెల 5వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు మేనేజర్, ఆపరేటర్ శశిధర్‌రెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు వనపర్తి రూరల్ ఎస్‌ఐ నాగన్న సోమవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. వనపర్తి మండలంలోని పెద్దగూడెంలో హెచ్‌పీసీఎల్ ఐపీ స్టేషన్‌లోని స్టోర్‌యార్డులో నిల్వ చేసిన స్క్రాప్ బ్యాటరీలు కనిపించకలేదు. దీంతో అక్కడి సిబ్బంది సీసీటీవీ పుటేజీ పరిశీలిస్తే ఈ నెల 5న మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారని గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.40 వేల వరకు ఉంటుందన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో..

వనపర్తి పట్టణ కేంద్రంలోని మర్రికుంట అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి హుండీ చోరీకి గురైంది. పోలీసులు వివరాల ప్రకారం.. పూజారి విజయ్‌కుమార్ ఆదివారం ఉదయం 6 గంటలకు ఆలయంలో పూజలు నిర్వహించి రాత్రి 8 గంటలకు ఆలయం మూసి వెళ్లి పోయారు. సోమవారం ఉదయం 6 గంటలకు వచ్చి చూడగా.. ఆలయం తాళం పగులగొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఆలయంలో హుండీ డబ్బులు సుమారు రూ.7 వేలు చోరీకి గురైందని తెలిపారు. పూజారి విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని వనపర్తి రూరల్ ఎస్‌ఐ నాగన్న తెలిపారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ ఫలాలు



గోపాల్‌పేట: మండలంలోని పొలికెపాడులో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ నాయకుడు సత్యశీలారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతి కార్యకర్త శాయశక్తులా కష్టపడి పనిచేయాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీతో గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో రోగాలు దూరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రకాశంశెట్టి

పాన్‌గల్: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలకు దూరంగా ఉండొచ్చని ఆరోగ్య విస్తరణ మండల అధికారి శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆరోగ్యంపై అవగాహన' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలను నివారించేందుకు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఎక్కువగా ఆకుకూరలు, పండ్లు తినాలని, మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. ఆరోగ్యం ఉండేందుకు విద్యార్థులు పాటించాల్సిన నియమాలపై పలు సూచనలు చేశారు. విద్యార్థులు చదవుతో పాటు క్రీడల్లో రాణించాలని ప్రిన్సిపాల్ ప్రకాశం శెట్టి అన్నారు. ప్రతి విద్యార్థి తన లక్ష్యానికి అనుగుణంగా చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి, అధ్యాపకులు, వైద్య సిబ్బంది, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయం, కేతేపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్‌ఎల్‌హెచ్‌పీ వైద్యాధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ ఆత్మహత్య ప్రయత్నం, లేనిది ఉన్నట్లు భ్రమపడటం, ఏకాగ్రత లోపం, స్వీయ నియంత్రణ లేకపోవడం, తనను తాను నిందించుకోవడం, తనలో తాను మాట్లాడుకోవడం వంటి లక్షణాలు ఉన్న వారు తోటి మిత్రులతో కానీ, ఉపాధ్యాయులతో కానీ, వైద్య సిబ్బందితో కానీ, మానసిక వైద్యుడిని సంప్రదించాలన్నారు. మానసిక సమస్యలు ఉన్నట్లయితే టోల్ ఫ్రీ నెంబర్ 14416ను సంప్రదిస్తే ఉత్తమ సేవలు అందుతాయని తెలిపారు. అన్నింటికీ ఆత్మహత్యలే పరిష్కారం కాదని, సమస్యలపై ధైర్యంగా పోరాడి సాటి వారికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సూపర్‌వైజర్లు సంతోషమ్మ, సుమనశ్రీ, వైద్య సిబ్బంది రాంచందర్, మదన్‌గోపాల్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత



మనిగిళ్లలో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మనిగిళ్లకు చెందిన ముష్టి కిష్టమ్మ(50) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎంపీపీ మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎంపీపీ దహన సంస్కారాల కోసం రూ.5వేలు పంపించారు. కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో గట్టుయాదవ్, ఊశన్న, పీఏసీఎస్ డైరెక్టర్ మన్నెంకొండ, కురుమూర్తి, మేస్త్రీ చంద్రయ్య, తిరుపతయ్య, బుచ్చన్న, రమేష్, అశోక్, పుట్టలయ్య, రాములు, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

వీపనగండ్ల: మండలంలోని సంగినేనిపల్లిలో నారాయణగౌడ్ మృతి చెందగా సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కాటమోని తిరుపతమ్మ, కొల్లాపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణయ్యగౌడ్ రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం పరంగా ఆదుకోవాలని వారు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగులను క్రమబద్ధీకరించే వరకు పోరాటం



వనపర్తిలో మాట్లాడుతున్న నాయకులు

పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలోని పంచాయతీ రాజ్ కార్యాలయం ఆవరణలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె సోమవారం నాటికి 12వ రోజుకు చేరింది. సమ్మెకు ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు ఉద్యోగులు మాట్లాడుతూ 11 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. జీఓ నెంబరు 510 ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. డీఈఓలను ఎల్డీ కంప్యూటర్‌గా మార్చాలని కోరారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ ఉద్యోగుల పనితీరుపై ప్రశంసలు కురిపిస్తున్న ప్రభుత్వం, అందులో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్న డిమాండ్లకు మాత్రం మోకాలు అడ్డుతుందని విమర్శించారు. హెల్త్ ఉద్యోగుల కృషి వల్లే వైద్య సేవల్లో దేశంలో రాష్ట్రం మూడో స్థానంలో నిలించిదని ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ప్రశంసలు కురిపించారని, దీని వల్ల కాంట్రాక్టు ఉద్యోగుల కడుపు నిండదన్నారు. వారు గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, నాడు ఉద్యమ నేతగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీ నేడు ముఖ్యమంత్రిగా నిలబెట్టుకోవాలని కోరుతున్నారని గుర్తుచేశారు. ప్రమాదవశాతు మరణిస్తే రూ.10 లక్షలు ఇవ్వాలన్న వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు బత్తుల రాఘవేందర్, వెంకటేష్, రాజేష్, ప్రవీణ, విజయకుమార్, సమీర్, భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్, మదన్‌కుమార్, స్పందన తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

ఆత్మకూర్: ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు భరత్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యూలర్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇంక్రిమెంట్లు, హెల్త్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, శ్రీకాంత్, మోదీన్, పార్వతమ్మ, చెన్నమ్మ, తిరుపతమ్మ తదితరులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి



ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

పాన్‌గల్: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరుతూ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాము మాట్లాడుతూ ఎంపీడీఓ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు, యూనిఫాం, సబ్బులు, నూనెలు అందించాలని కోరారు. ఇటీవల మండల కేంద్రంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో పంచాయతీ కార్మికులకు ఎమ్మెల్యే ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. దీంతో పాటు కార్మికులకు దళితబంధు, బీసీ బంధు, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, గృహలక్ష్మి వంటి పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన కార్మికులకు పింఛన్లు కూడా అమలు చేయాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో యాదగిరి, సుగ్రీవుడు, బాలస్వామి, కిషన్‌నాయక్, రంగస్వామి, అర్జునయ్య, తిరుపతయ్య, వెంకటయ్య, కృష్ణమ్మ, భాగ్యమ్మ, శాంతమ్మ, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

పాన్‌గల్: అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము అన్నారు. హైదరాబాద్‌లో హెల్త్ కమిషనర్ కార్యాలయం ముట్టడికి వెళ్లకుండా సోమవారం ఆశా కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో వారిని కలిసి మద్దతు ప్రకటించిన ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని శాంతియుతంగా నిరసన తెలిపే వారిని అరెస్టు చేయడం సరికాదన్నారు. ఆశా కార్యకర్తలు అధైర్యపడవద్దని సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరారు. ఉద్యమం సమయంలో, ఎన్నికల సందర్భంలో ఆశాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన ఆశా కార్యకర్తలు రేణుక, అలివేలు, సరస్వతి, కవిత, లలిత, యాదమ్మ, సునీత, శివరాణి, రామేశ్వరమ్మ, నాగలక్ష్మి, సంధ్య, ప్రమీల, కవిత, సరిత, సరోజ తదితరులు పాల్గొన్నారు.



పాన్‌గల్ స్టేషన్‌లో ఆశా కార్యకర్తలు